


# టాకింగ్ ఫ్రమ్ కావలి మునిసిపాలిటీ...

'మావా.. రేప్పొద్దున దాకా మనం వెయిటు చేయడం దండగమారి పని. అట్టా వెయిటు చేస్తే తక్కినోళ్లకీ మనకీ తేడా ఏముంది? ఈపాటికి పేపరాపీసులకి రిజల్ట్సు వచ్చే సుంటాయి. రేణిగుంటకి గనక ఫోను చేస్తే 'ఎంతమ్మా మీ నెంబరు' అని మరేదగా అడిగి మరీ మన రిజల్ట్సు చెప్పేస్తారు. పేపరోళ్లంటే ఎవరు? బలే బాద్యత గలిగిన మనుషులు గదా. వాళ్లతో మనం డైరెక్టుగా మాట్లాడదాం మావా' అన్నాను అందరి వంకా చూస్తా.

అప్పటికే నలుగురం పోలేరమ్మ అరుగు మీదకి చేరుకొని ఉన్నాం రేడియో యినేసి.

రేప్పొద్దున టెన్తు కిలాసు రిజల్ట్సు రాబోతా ఉన్నాయనీ, ఈసారి రాష్ట్ర వ్యాపితముగా ఉత్తీర్ణతా శాతము ఫలానా అనీ, బాలికల శాతము డాష్ అనీ, బాలుర శాతం డాష్ డాష్ అనీ, మొత్తం మీద ఫలితాలు అంత ఆశాజనకముగా లేవనీ... ఇంకా ఏందేందో చెప్పి నారు మద్యానం వార్తల్లో.

అవి యిన్నప్పటాల్నించి మాకు ముద్ద దిగలా. మొకాలు యికారంగా పెట్టి అరుగు మీదికి చేరుకున్నాం. అందరూ డల్లుగా ఉండేసరికి నేనే చెప్పినాను-

'ఒరే.. మనం అంత హైరానా పడాల్సిన పని లేదురా. పేపరాపీసుకి ఫోను చేయడమే కరెక్టు పని. ఎన్నిసార్లు చూళ్లా ప్రింటింగ్ ప్రెస్సుల్ని? వాటిల్లో పెళ్లికార్డులు ఎట్టా ప్రింటు చేస్తారో మనకు తెలియదా? ఒక్కోకార్డు తీసీ పెట్టీ తీసీ పెట్టీ పగలు పొద్దస్తం కొడతానే ఉంటారు. ఇంత గద్దు పెళ్లికార్డులకే అంత టైము పడితే అన్ని వేల న్యూసు పేపర్లని ప్రింటింగు చేసే దానికి ఎంత టైము పట్టాలా? ఒక్కో పేపరు తీసి పెట్టి తీసి పెట్టి కొడతానే ఉంటారురా వాళ్లు. అందుకని వాళ్లకి ఒక రోజు ముందరే వచ్చేస్తాయి రిజల్ట్సు. మనం ఫోన్ చేద్దాము మావా' అన్నాను ఎంతో నమ్మకంగా.

నా మాటల వల్ల కొంత, వాళ్లకున్న టెన్షను వల్ల కొంత వాళ్లు కూడా ఎంటనే ఓకే చేసేసినారు నా ఐడియాని.

'చేద్దాము సరేరా? వాళ్లతో ఎవరు మాట్లాడుతారురా?' అన్నాడు కాండూరి మురళీగాడు.

'అవునురా. ఇప్పటిదాకా మనం పోస్టాపీసుకు పోయి దూరాలకి ఫోను చేసింది లేదు కదరా. ఎట్టరా మాట్లాడటం?' అన్నాడు శ్రీదరుగాడు.

'ఒరే.. అయ్యన్నీ ఉత్తమాటలురా. టెన్తు కిలాసు చదివినాక యింక మనకి ఒకటి తెలుసు ఒకటి తెలియదు అని లేదురా. అన్నీ తెలిసిపోయినట్టే పదండ్రా' అన్నాను నేను.

అందరం డబ్బులు చూసుకొని బయలుదేరతా ఉంటే మళ్లా డౌటొచ్చి ఆపేసినాను.

'ఏందిరా?' అన్నారు వాళ్లు.

'ఏమి లేదురా. అసలికే పేపరాపీసు. వాళ్లతో చాలా మరేదగా మాట్లాడాలా. తెలుగులో మాట్లాడితే సమాదానం చెప్తారో లేదో. ఇంగిలీషులో మాట్లాడితే బెటరురా' అన్నాను వాళ్లతో.

'అవునురా. కరెక్టురా' అన్నారు అందరూ.

'కానీ మనకంత ఇంగిలీషు యాడొచ్చురా?' అన్నాడు మురళీగాడు.

కాసేపు ఆలోచించి అందరం ఈ పనికి కందులుగాడే కరెక్టు అనే నిర్ణయానికి వచ్చినాం.

'కందులుగా నువ్వు మాట్లాడరా. నీకు నౌను, ప్రొనౌను, వెర్బు మీద కమాండింగు ఉందిగదరా. నువ్వు మాట్లాడితేనే బెటరురా' అన్నాము వాడితో.

వాడు అట్టా యిట్టా కాసేపు చూసి దైర్నం చేసి 'సరేరా.. ట్రయి చేస్తానురా' అన్నాడు.

నలుగురం పోస్టాపీసుకి పోయి, రేణిగుంట పేపరాపీసు నెంబరు అడిగి, దానిని చీటి మీద రాసి, యిరవై రూపాయలు అడ్వాన్సు గట్టి, ఆ డబ్బులూ చీటీ చేతిలో పెట్టి ఫోను కోసం నిలుచున్నాం.

మూడు నాలుగుసార్లు కొట్టంగా కొట్టంగా లైను కలిసింది.

అవతలి వైపు రింగు... మాకు టెన్షను...

రిసీవరు పట్టుకున్న కందుల మాలకొండరావుగాడి చెయ్యి వణకతా ఉంది.

అవతల వైపు నుంచి 'హలో' అన్నారు ఎవరో.

మాలకొండరావుగాడు అందుకున్నాడు ' హలో... దిసీజ్ మాలకొండరావ్ కందుల్.. టాకింగ్ ఫ్రమ్ కావలి మునిసిపాలిటీ నెల్లూరు డిస్ట్రిక్ట్... మే అయ్ నో వాట్ యీజ్ హాపనింగ్ అబౌట్ టెన్త్ కిలాస్ రిజల్ట్స్... ఉయ్ ఆర్ పూర్ స్టూడెంట్స్ వాంటెడ్ టు నో'...

ఫోను కట్టయ్యింది.

'అమ్మయ్య' అనుకున్నాడు మాలకొండరావుగాడు. అసలకే వాడికి చెమటబాధ. ఈ టెన్షను దెబ్బకి ఒళ్లంతా తడిసిపోయింది.

'నాయనా. బతికినాను పో. నా వల్ల కాదురో' అన్నాడు జేబులో నుంచి కర్చీఫు తీసి ఒళ్లంతా తుడుచుకుంటా.

మాకు కోపం వచ్చేసింది.

'ఇంతదాకా వచ్చి మాట్లాడకపోతే ఎట్టరా? మళ్లా చేసి మాట్లాడాల్సిందేరా' అన్నాను నేను.

'అసలకి నిన్ను 'ఉయ్ ఆర్ పూర్ స్టూడెంట్స్' అని ఎవరనమన్నారురా? స్కాలరుషిప్పుల కోసం ఎవరో బీదపిలకాయలు చేస్తా ఉన్నారని చెప్పి పెట్టేసుంటారురా' అన్నాడు శ్రీదరుగాడు.

మళ్లా అందరం పోలోమంటా ఎళ్లినాం ఫోనుకాడికి.. సేమ్ నెంబరు.. సేమ్ చీటి.. ఒకటి రెండుసార్లు ట్రయి చేయంగానే కలిసింది.

ఈసారి మాలకొండరావుగాడికి కొంచెం వణుకు తగ్గి దైర్నంగా మాట్లాడినాడు....

'హలో... దిసీజ్ టాకింగ్ ఫ్రమ్ కావలి మునిసిపాలిటీ ఆన్ ట్రంక్‌రోడ్... ఈజ్ అవర్ టెన్త్ కిలాస్ రిజల్ట్స్ అరైవ్డ్ టుయూ?'...

జవాబు ఏమొస్తుందా అని మేం కూడా మా చెవుల్ని తీసకెళ్లి రిసీవరు కాడ పెట్టినాం.

నిమిషం దాకా ఏమీ సౌండులా. నిమిషం తర్వాత 'వాట్?' అని యినిపించింది.

మాలకొండరావుగాడు 'రిజల్ట్స్.. టెన్త్ కిలాస్ రిజల్ట్స్... ఉయ్ హైస్కూల్ స్టూడెంట్స్.. అవర్ రిక్వెస్ట్ యు హియర్?' అన్నాడు పెద్దగా.

మళ్లా కాసేపటి దాకా అవతలి పక్క నుంచి ఏమీ సౌండులేదు. కాసేపు తాలాక మా చెవుల్లో తేనె పోస్తా 'తెలుగు.. తెలుగు'.. అనే మాట యినిపించింది.

ఇంక మాలకొండరావుగాడికి దైర్నం వచ్చేసి 'సార్.. మేము కావలి నుంచి యిశ్వోదయ పిలకాయలం మాట్లాడతా ఉన్నాము. మా టెన్తు రిజల్ట్సు వచ్చినాయా సార్?'... అన్నాడు గబగబా.

'రాలేదు.. రేపొద్దున వస్తాయి. మద్యానానికల్లా రూపాయి ఎడిషను కొడతాము. కొని చూసుకోండి' అని ఫోను పెట్టేసినారు.

ఉసూరుమనింది ప్రాణం.

నలుగురం అంజీ హోటలు కాడికొచ్చి తలా ఒక స్ట్రాంగు టీ తాగినాం. అయినాగానీ హుషారు ఏమీ రాలా. మద్యానం వార్తల దెబ్బకి అందులో చెప్పిన డాష్ డాష్‌ల దెబ్బకి మా ప్రాణాలు డల్లుగా అయిపోయున్నాయి.

'మావా... పేపర్లు దిద్దే పని ఎట్టా చేస్తారో మనకు తెలియదు. రకరకాలుగా చెప్తా ఉంటారు సీనియర్లు. కొందరు సరిగ్గానే దిద్దరంట. కొందరు మరీ సరిగ్గా దిద్ది మార్కులు తక్కువ ఏస్తారంట. కొందరికి టోటళ్లు సరిగ్గా రాక ఒకటి కూడబోయి ఇంకొకటి కూడి నాశినం చేస్తారంట. ఇంకొందరు వాళ్ల ఇళ్లల్లో ఉండే కోపాలనో తీర్చాల్సిన పాతబాకీలనో గుర్తుకు తెచ్చుకొని అదంతా మన పేపర్ల మీద చూపిస్తారంట'.. అన్నాడు శ్రీదరుగాడు దిగులుగా.

'అట్టా చేస్తారు కాబట్టే ఏమోరా ఉత్తీర్ణతా శాతము పడిపోయేది' అన్నాడు కందుల గాడు.

'పడిపోతే పడిపోయిందిరా. రిజల్టుస్‌లో మన నెంబర్లు సరిగ్గా అచ్చు అయితే అంతే చాలురా. మనం ప్యాసైనా ఒక్కోసారి పేపర్లలో నెంబర్లు మిస్సు చేస్తా ఉంటారంట. అట్టా మిస్సయ్యి తొందరపడి సచ్చిపోయినోళ్లు కూడా ఉన్నారు గదరా. మనకి మాత్రం ఆ కర్మ పట్టకూడదురా' అన్నాడు మురళీగాడు...

చావు మాట వచ్చేసరికి మాకు బయం పుట్టింది. టెన్తు ఫెయిలైనామని చెప్పి లేనిపోని ప్రిస్టేజీలకి పోయి ఎంత మంది పిలకాయలు సచ్చిపోలా?

ఎందుకైనా మంచిదని నేనే అన్నా– 'ఒరే... మనం ముందరే ఒక మాటనుకుంటే బెటరురా. మనలో ఒక్కడు ప్యాసైనా తక్కినవాళ్లంతా వాణ్ణి చూసుకొని బతికిపోవాలిరా' ...

'కరెక్టురా. ఆ మాట మీదే నిలబడదామురా అందరం' అన్నాడు శ్రీదరుగాడు..

ఆ రాత్రి ఎట్ట గడిచిందో, ఏమి నిద్దర్లు పట్టినాయో, ఎట్ట తెల్లారిందో తెలియనే తెలియదు.. మొకాలు కడుక్కుని టిఫెనుకి డబ్బులు తీసుకొని ట్రంకురోడ్డు మీదకి వచ్చేసినాం నలుగురం.

అప్పటికే పిలకాయలంతా రోడ్డు మీదకి వచ్చేసి మందలు మందలుగా తిరగతా ఉన్నారు గోలగా. ఇదిగో ఇప్పుడొస్తుంది పేపరు వ్యాను అంటే అదిగో అప్పుడు వస్తుంది అని న్యూసు.

దారిన పోతున్న వ్యానులన్నింటిని ఆశగా చూస్తా మేం నలుగురం తిరగతా ఉంటే ఎనక నుంచి వచ్చి దబీమని యీపు మీద బాది పలకరించినాడు శెట్టిగార్ల పిల్లోడు మెంటామదుగాడు. వాణ్ణి చూసి–

'మావా.. ఏందిరా సంగతి' అన్నాం వాడితో.

'ఏముందిరా.. ఇంటికాడ మా నాయన వంద కట్ట పట్టుకొని ఉన్నాడు. మనం ప్యాసైనామని తెలిస్తే చాలు ఆ కట్ట మనదే మావా' అన్నాడు వాడు హుషారుగా.

'మరి ఫెయిలైతేరా'.. అన్నాను నేను.

'అప్పుడు కట్ట కాదురా.. కట్టె.. సవక్కట్టె తీసుకొని యీపు వాయింపుడురా. అయినా నాకేమీ బయం లేదురా.. మనం దేనికైనా రెడీరా' అన్నాడు గంబీరంగా.

ఆ తర్వాత షేక్ గౌస్‌బాషాగాడూ, ఎ.చెన్నక్రిష్ణయ్యగాడు అవుపించినారు. ఇద్దరూ లుంగీలు కట్టుకొని ఫ్రెష్షుగా ఉన్నారు... వాళ్ల జేబుల్లో తలో వందా ఉన్నాయి.

'ఏం మావా?' అని అడిగితే–

'ఏముందిరా.. ప్యాసయితే సరే.. లేకుంటే ఇదిగో ఈ డబ్బులుతో ఇటునించి ఇటే లారీ ఎక్కి నెల్లూరుకి పారిపోతాం. రెండు మూడు రోజులు ఆణ్ణే ఉండి సినిమాలు చూసుకొని వచ్చినామంటే అప్పటికి ఇంట్లో వాళ్లు సెట్టయిపోయుంటారు... ఎట్టా మాటినే రకాలం గాదు.. మమ్మల్ని ఏం చేస్తారురా' అన్నాడు చెన్నక్రిష్ణయ్యగాడు..

మేము మాటల్లో ఉండగానే పేపరు వ్యాను వచ్చేసింది...

'అదిగో వ్యాను' అన్నారు ఎవరో..

గుండె లబలబ.. ఒళ్లు దడదడా.. చేతులు వణుకు.. కాళ్లు పీకుడు... పట్టు.. లాగూ.. పీకూ..

నేను కింద నుంచి దూరెల్లి పైనుంచి ఒక పేపరుతో సహా బయటకి వచ్చేసినాను. దానిని చూట్టంతోటే– 'స్వామీ ఎంకటేశ్వరస్వామీ' అన్నాడు శ్రీదరుగాడు.

'అయ్యా.. మాలకొండయ్యా.. మాలకొండస్వామి' అన్నాడు కందులుగాడు..

'పాహిమాం పాహిమాం... కృష్ణ కృష్ణ పాహిమాం' అన్నాడు మురళీగాడు..

'యా మెరె పర్వర్‌దిగార్.. ముష్కిల్‌కుషా' అన్నాను నేను.

నలుగురం పేపరు చుట్టూ చేరినాం..

శ్రీదరుగాడి చెయ్యి మంచిదని మొదలు వాడి నెంబరు చూసినాము...

ఫస్ట్ కిలాసు!

ఆ తర్వాత మురళీగాడి నెంబరు.. ఫస్ట్ కిలాసు.. ఆ తర్వాత మాలకొండరావుగాడి నెంబరు.. ఫస్ట్ కిలాసు.. ఆ తర్వాత నా నెంబరు... ఫస్ట్ కిలాసు...

మా మొకాల్లో నవ్వు వచ్చేసింది. ఒకరి బుజాల మీద ఒకరం చేతులేసుకొని కిలకిలా నవ్వుకున్నాం. మా నవ్వు చూసి ముచ్చటపడి దారినపోయే వాళ్లు కూడా నవ్వినారు. ఆ తర్వాత మా యిళ్లల్లో నవ్వు... మా అమ్మల్లో నవ్వు.. మా నాన్నల్లో నవ్వు... మేం కష్టపడి ప్రయోజకులం అయినందుకు అందరికీ ఎంత యిది అంటే.. ఆ సంతోషంలో ఆ గాబరాలో.. శ్రీదరోళ్ల నానమ్మ నా మీద పగని కూడా మరిచిపోయి నాక్కూడా పెట్టేసింది నోట్లో లడ్డు...

కమ్మటి తీపి. నోరంతా తీపి.

ఆ తీపి తీపి అట్టాగే ఉండిపోయింది నాతో. దానిని ఇన్నాళ్లూ బద్రం చేసి ఈ యిరవై అయిదు వారాలు కొంచెం కొంచెంగా మీకు పంచినాను..

■